సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



సీపీఎం నేతల చుట్టూ స్థల వివాదం

కడప భగత్‌సింగ్ నగర్‌లోని విలువైన ఓ ప్రభుత్వ స్థలం విషయంలో స్థానికులు, సీపీఎం నాయకుల మధ్య వివాదం మళ్లీ రాజుకుంది. -8లో



లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి

చెన్నంపల్లెలో లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
37.2/24.5

వాతావరణం

జిల్లాలో బుధవారం 24.5 – 37.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పీజీ ఫలితాలు విడుదల

కడప ఎడ్యుకేషన్: వైవీయూ సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ పీజీ మొదటి, రెండవ సెమిస్టర్ల ఫలితాలను సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) డైరెక్టర్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ శ్రీధర్ బాబుతో కలసి బుధవారం విడుదల చేశారు. ఆచార్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ 1, 2వ సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరి 8 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించామన్నారు.

ఉచిత శిక్షణ

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయదలచిన విద్యార్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణను బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ జ్యోతి ప్రారంభించారు. ఈ శిక్షణ తరగతులను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందని తెలిపారు. ఉచిత శిక్షణతోపాటు శిక్షణకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను కూడా ఉచితంగా ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు.

16న మత్స్య సహకార సంఘాల నూతన పాలకవర్గం ఎన్నిక

కడప అగ్రికల్చర్: వైఎస్సార్ కడప జిల్లాలోని మత్స్య సహకార సంఘాలకు ఏప్రిల్ 16వ తేదీన నూతన పాలక వర్గ సభ్యుల ఎన్నిక నిర్వహించనున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి శాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలోని జీవి సత్రం, నరసాపురం, బద్వేల్, చిన్న శింగనపల్లి, యర్రబల్లిలోని మత్స్య సహకార సంఘాలకు నూతన పాలక వర్గ సభ్యుల (చేతులు ఎత్తు పద్దతి ద్వారా) ఎన్నిక ఉంటుందన్నారు. ఈ ఎన్నికల నిర్వహణకు కలెక్టర్ షెడ్యూల్‌ను జారీ చేశారని ఆమె తెలిపారు. మత్స్య సహకార సంఘంలో సభ్యత్వం కలిగిన సభ్యులకు మాత్రమే ఓటు హక్కు ఉంటుందన్నారు.

నేడు వైవీయూలో ఉద్యోగ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్: యోగి వేమన విశ్వవిద్యాలయంలో గురువారం క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ కళాశాల ప్రధాన ఆచార్యులు ప్రొఫెసర్ ఎస్ రఘునాథరెడ్డి తెలిపారు. ఉద్యోగాల ఎంపికలకు ప్రముఖ మల్టీ నేషనల్ బయో ఫార్మసూటికల్ కంపెనీ 'బయోకాన్' ప్రతినిధులు విద్యాలయానికి రానున్నారని తెలిపారు. ఆ కంపెనీ ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగాలకు బీఎస్సీ కెమిస్ట్రీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, డిప్లొమా – కెమికల్, బీటెక్ – కెమికల్ అర్హతలు కలిగి ఉండాలన్నారు. క్వాలిటీ కంట్రోల్ విభాగంలో ఉద్యోగాల కోసం ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ అర్హతలు ఉండాలన్నారు. ఇంజనీరింగ్ అండ్ మెయింటెనెన్స్ విభాగాలలో ఉద్యోగాల కోసం మెకానికల్, ఈఈఈ, ఈసీ, ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో బీఈ, బీటెక్, డిప్లొమా అర్హతలు ఉన్నవారు అర్హులన్నారు. 2023, 2024, 2025 బ్యాచ్‌లలో చదివిన, ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు మాత్రమే డ్రైవ్ లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. విద్యార్థులు వారి బయోడేటాతో విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఏపీజే అబ్దుల్ కలాం కేంద్ర గ్రంథాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావాలన్నారు.

ఆడబిడ్డల పెళ్లిళ్లు చేసేదెలా..?

భగ్గుమంటున్న బంగారం

- పది గ్రాములు రూ.91,980 మార్కుకు చేరిన పసిడి
- తులం కొనాలంటే.. అమ్మో.. అంటున్న పేద, మధ్యతరగతి ప్రజలు
- తల్లిదండ్రులకు భారంగా మారిన ఆడపిల్లల పెళ్లిళ్లు
- విక్రయాలు తగ్గాయంటున్న వ్యాపారులు
- ట్రంప్ వివాదాస్పద నిర్ణయాలే కారణమంటూ విమర్శలు





కడప సెవెన్‌రోడ్స్: పవన్‌కుమార్ (పేరు మార్చాం) రెవెన్యూశాఖలో నాల్గవ తరగతి ఉద్యోగి. వచ్చే జీతం ఇంటి అవసరాలకే అంతంత మాత్రంగా సరిపోతోంది. పర్సనల్ లోన్‌తోపాటు ప్రైవేటు అప్పులు ఉన్నాయి. పల్లెలో తన భాగంగా వచ్చిన నాలుగు ఎకరాల భూమి ఉంది. కరువుతో పంటలు పండడం లేదు. పోనీ పొలం అమ్మేసుకుందామంటే ధర లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రిజిస్ట్రేషన్ ఛార్జీలు ఇబ్బడి ముబ్బడిగా పెంచడంతో భూమి అడిగేవారు కరువయ్యారు. అయినకాడికి అమ్మేసుకుని బిడ్డ పెళ్లి చేసి పంపిద్దామంటే, కనీసం 10 తులాలు బంగారం కూడా సర్దుబాటు చేసే ఆర్థిక పరిస్థితి లేదు. ఏం చేయాలో పాలుపోక తల పట్టుకున్నారు. ఇది పవన్‌కుమార్ పరిస్థితే కాదు, మధ్య తరగతి, దిగువ శ్రేణి కుటుంబాలు ఎదుర్కొంటున్న వ్యథ.

ముందుచూపు కాపాడుతోంది

పాత బంగారం ఉండేవారు, ధర తగ్గిన సందర్భాల్లో తులమో, అరతులమో తీసుకుని ఎత్తి పెట్టుకున్న వాళ్లు, ముందుచూపుతో గోల్డ్ కాయిన్స్ కొనుగోలు చేసిన వాళ్లు సేఫ్ జోన్‌లో ఉన్నారు. మార్వాడీ సేట్‌ల వద్ద బంగారు కుదువ పెట్టి అప్పు తెచ్చుకున్న వాళ్ల వడ్డీ చెల్లించలేక అది వేలానికి వస్తే భవిష్యత్తులో కొత్త బంగారం కొనవచ్చనే ధీమాతో గతంలో వదిలేసేవారు. ఇప్పుడు ధరల్లో కొనలేమని ఎన్ని ఇబ్బందులు పడైనా సరే వడ్డీ చెల్లించి బంగారాన్ని కాపాడుకుంటున్నారు.

ఇక ఎటొచ్చి పాత బంగారు లేకుండా, కొత్తగా కొనుగోలు చేయాలనుకునే వారి పరిస్థితి దారుణంగా ఉంది. చాలామంది తల్లిదండ్రులు తమ ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయలేకపోతున్నారు. కొన్నిచోట్ల వాయిదాలు వేసుకుంటున్నారు. ఎదిగిన బిడ్డలను ఎక్కువ కాలం ఇంట్లో ఉంచుకుంటే అదొక అవమానం. అనేక కుటుంబాల్లో కల్లోలం రేపుతున్న బంగారం ధర ఎందుకిలా పెరిగిపోతోందో అర్థంగాక సతమతమవుతున్నారు.

మాకు కట్నమేమి అక్కర్లేదు...అది మా ఇంటా వంటా లేదు. అసలే ఆ మాటే మా చెవిన పడరాదు. కాకపోతే ఏదో మీరుముచ్చట పడుతున్నారు కాబట్టి మీ అమ్మాయికి ఓ 20 తులాల బంగారం పెట్టండి చాలు. అది మా కోసం కాదు...మీ అమ్మాయి సంతోషం కోసమే అంటూ పెళ్లి చూపుల్లో మగ పిల్లాడి తల్లిదండ్రులు అనడంతో అమ్మాయి తల్లిదండ్రులకు మైండ్ బ్లాక్ అయినంత పనైంది. ఎందుకంటే మార్కెట్‌లో బంగారం ధర భగ్గుమంటోంది. ఇప్పటికే తులం రూ.91,980 ధర పలుకుతోంది. రూ. లక్షకు చేరుకుంటుందని అంతటా చర్చ నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో బంగారం కొనేందుకు రూ.20 లక్షలు అవుతుంది. ఇరువైపుల దుస్తులు, కల్యాణ మండపం, భోజనాలు, ఇతర సాంగ్యాలు,వీడియో షూట్ కలిపి మొత్తం పెళ్లి తంతు పూర్తయ్యేసరికి రూ. 30 లక్షలు ఖర్చు వస్తోంది.

అంతర్జాతీయ పరిణామాలు...

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితి, తక్కువ వడ్డీ రేట్లు, అమెరికన్ డాలర్ బలహీన పడటం వంటి కారణాలు సాధారణంగా బంగారం ధరలు పెరుగుదలకు దారి తీస్తాయి. ఇప్పుడు రష్యా–ఉక్రెయిన్ మధ్య సీజ్ ఫైర్ కుదిరింది. హిజ్బుల్లా, హమాస్‌లపై ఇజ్రాయిల్ దాడులు ఆగాయి. అంటే జియో పొలిటికల్ టెన్షన్స్ దాదాపు తగ్గుముఖం పడుతున్నాయి. అయితే ఈ దశలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విచ్చలవిడి టారిఫ్‌లు విధించడం ప్రారంభించారు. ఈనెల 2వ తేది నుంచి టారిఫ్‌లు అమలులోకి రానున్నాయి. ట్రంప్ సుంకాలు విధించడం, ఆంక్షలు విధిస్తానంటూ ప్రపంచ దేశాలను హెచ్చరించడం, రెసెషన్ రానుందని మాట్లాడటం వంటి వివాదాస్పద చర్యల వల్ల యూఎస్ డాలర్ విలువ పడిపోతోంది. దీంతో మదుపరులు బంగారంలో పెట్టుబడులు పెడుతున్నారు. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా కూడా విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో బంగారం వాటా పెంచే చర్యలు చేపడుతోంది. ఇంకా వివిధ కారణాల వల్ల బంగారం ధర దూసుకుపోతోందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

రోజు రోజుకు పెరుగుతున్న ధరలు



ఐదేళ్ల క్రితం 2020 మార్చి 22వ తేది కరోనా లాక్‌డౌన్ ప్రకటించడానికి ముందు బంగారం తులం ధర రూ.30 నుంచి 32 వేలు ఉండేది. ఆ సంవత్సరం అక్టోబరు 10వ తేది నాటికి రూ. 52,300కు చేరింది. అప్పటి నుంచి ఎగబాకుతూనే ఉంది. ముఖ్యంగా గత ఆరు నెలలుగా పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. 2024 నవంబరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కడప మార్కెట్‌లో రూ.76 వేలు ఉండగా, నేడు రూ. 91,980 చేరింది. అలాగే 22 క్యారెట్ల బంగారం ధర రూ.85,100 చేరింది. కరోనా ముందునాటి ధరలతో పోలిస్తే ఈ ఐదేళ్లలో బంగారం ధర దాదాపు మూడింతలైంది. ఒకప్పుడు బంగారాన్ని అలంకరణలు, సామాజిక అవసరాలకు వినియోగించేవారు. నేడు దాన్ని ఒక సురక్షితమైన పెట్టుబడిగా భావిస్తున్నారు. ఎందుకంటే డబ్బులు బ్యాంకులో దాచుకున్నా వడ్డీ రేట్ల ద్వారా పెద్ద రాబడి ఉండదు. డిపాజిట్ల మొత్తాన్ని అనుసరించి ఐటీ కూడా చెల్లించాల్సి ఉంటుంది. రియల్ ఎస్టేట్, షేర్లు, బాండ్ల కొనుగోలుపై పెడితే ఒక్కో సందర్భంలో నష్టపోవాల్సిన పరిస్థితులు కూడా రావచ్చు. అదే బంగారమైతే అర్ధరాత్రి వెళ్లి అమ్మినా ధర ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. పెళ్లిళ్లలో మగపిల్లవాడి తల్లిదండ్రులు డబ్బు కంటే బంగారం ఎక్కువ అడుగుతున్నారంటే కారణం ఇదే.

భారంగా మారిన బంగారం కొనుగోలు



ఆడబిడ్డలుగల తల్లిదండ్రులకు బంగారం ధర ఆందోళనకు గురి చేస్తోంది. తమ ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయాలని నిర్ణయించుకుంటే ముందుగా బంగారం గురించి ఆలోచిస్తాం. ధర విపరీతంగా పెరగడంతో బంగారం కొనుగోలు చేయలేక అమ్మాయి వివాహం తల్లిదండ్రులకు తలకుమించిన భారంగా మారుతోంది. – చాన్‌బాషా, కడప

వ్యాపారాలు డీలా పడ్డాయి



గత ఆరు నెలలుగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం బంగారం ధరపై ఉంటోంది. ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు ఎగబాకడంతో కొనుగోళ్లు సగానికి సగం పడిపోయాయి. – గోవిందు నాగరాజు, బంగారు వ్యాపారుల అసోసియేషన్ ఉపాధ్యక్షులు, కడప

అంతర్జాతీయ ఉద్రిక్తతలు కారణం



రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, ఇజ్రాయిల్ గాజాపై చేస్తున్న దాడులు కారణంగా బంగారం ధరలు పెరుగుతూ వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం బంగారు దిగుమతులపై నాలుగు శాతం కస్టమ్స్ డ్యూటీ తగ్గించింది. లేకపోతే ఈపాటికే తులం రూ.లక్ష దాటేది. పేద వర్గాల వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. – సయ్యద్ సలావుద్దీన్, బంగారు దుకాణ యజమాని, కడప

ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: అసంఘటిత రంగ కార్మికులకు ఎంతో ప్రయోజనకారిగా ఉంటున్న ఈ–శ్రమ్ పోర్టల్‌లో ప్రతి కార్మికుడు నమోదు చేసుకోవాలని కార్మికశాఖ ఉప కమిషనర్ శ్రీకాంత్‌నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం ఎన్జీఓ కాలనీలోగల ఇన్‌స్టా కార్ట్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థలో గిగ్ వర్కర్స్, ప్లాట్‌ఫారం వర్కర్లు, హోటల్ యాజమాన్యానికి ఈ–శ్రమ్ పోర్టల్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 600 మంది వరకు ప్లాట్‌ఫారం వర్కర్లు జొమోటా, స్విగ్గి, ఓలా, ఉబర్ రాపిడ్ వంటి వాటి లో పనిచేసేవారు ఉన్నారన్నారు. వీరందరినీ ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. వర్కర్లు ఆధార్, పాన్ నెంబర్లకు అనుసంధానమైన ఫోన్ నెంబరు కలిగి ఉండాలన్నారు. కార్మికుల వయస్సు 18–59 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. ఈ నమోదు ప్రక్రియ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ సీఎస్‌సీ సెంటర్లు గ్రామ, వార్డు సచివాలయంలో చేసుకోవచ్చని తెలియజేశారు.

కార్యాలయాలన్నీ ఒకే చోట ఉండటం సౌకర్యవంతం

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్



సచివాలయ సముదాయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే వరద, కలెక్టర్ శ్రీధర్ తదితరులు

ప్రొద్దుటూరు రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండటం ప్రజలకు చాలా సౌకర్యవంతమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ కానపల్లె గ్రామ సచివాలయ నూతన భవన సముదాయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అనే అంశంతో సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ లను ఒకే ప్రాంగణంలో నిర్మించాలన్న ఆలోచన చేసిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభినందిస్తున్నానన్నారు. సంపదను సృష్టించడం నాయకుడి ప్రధాన లక్షణమని, ఉన్న ఊరు సొంత ప్రాంతాన్ని చక్కపెడితే రాష్ట్రాన్ని అభివృద్ధి చేసినట్లే అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రపంచంలో 11వ స్థానంలో ఉన్న దేశ ఆర్థిక పరిస్థితిని 4వ స్థానంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం 3,260 విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మంజూరు చేసిందని, ఆగిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్‌లను పూర్తి చేస్తామని తెలిపారు. జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్రలో భాగంగా ప్రజలు, దాతలు భాగస్వాములతో అట్టడుగున ఉన్న పేదలను అత్యున్నతంగా ఉన్న సంపన్నుల ద్వారా అభివృద్ధి చేయడం పీ4 కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, ఆదినారాయణరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, ఆర్డీఓ సాయిశ్రీ, డీఎస్పీ భావన, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, సంస్కృతి స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, వీఎస్ ముక్తియార్, కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, తహసీల్దార్ గంగయ్య, ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి, మండల వ్యవసాయాధికారి శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు రాబట్టేలా పనిచేయాలి

కడప కోటిరెడ్డిసర్కిల్: రానున్న ఎన్నికల్లో ప్రజలు ఓట్లు రాబట్టేలా బీజేపీ శ్రేణులు పనిచేయాలని మంత్రి సత్యకుమార్ పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం హరిత హోటల్ సమావేశ మందిరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకట సుబ్బారెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి సత్యకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి లక్షల కోట్ల సాయం అందుతోందని, మోడీ నాయకత్వం ఈ దేశానికి అవసరమన్నారు. సామాన్య కార్యకర్త నుంచి ప్రధానమంత్రి స్థాయి వరకు ఎదిగే అవకాశం ఒక్క బీజేపీలోనే ఉంటుందని, ఇందుకు ఉదాహరణలు ఉన్నాయన్నారు. అనంతరం బీజేపీ నూతన అధ్యక్షుడిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు వంగల శశి భూషణ్ రెడ్డి, పుప్పాల శ్రీనాథ్‌రెడ్డి, బొమ్మన సుబ్బరాయుడు, లక్ష్మీనారాయణ రెడ్డి, బొమ్మన విజయ్, బత్తుల పవన్ కుమార్, బాలకృష్ణ యాదవ్, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, జనసేన నేత సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

పది మూల్యాంకనానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం.. 9వ తేదీ వరకు నిర్వాహణ
- ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ అధికారులు
- జిల్లాకు చేరిన సమాధాన పత్రాలు
- 1337 మంది సిబ్బందితో మూల్యాంకనం



మూల్యాంకన కేంద్రంలో వసతులను పరిశీలిస్తున్న డీఈఓ షేక్ షంషుద్దీన్

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదవ తరగతి పరీక్షలు ఏప్రిల్ 1వ తేదీకి ప్రశాంతంగా ముగిశాయి. జిల్లాలో 161 పరీక్షా కేంద్రాలలో 28,700 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలను రాశారు. కాగా.. సమాధాన పత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 3వ తేదీ నుంచి కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి వచ్చిన పరీక్ష పేపర్లకు కోడింగ్ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. బుధవారం సాయంత్రం వరకు అన్ని సబ్జెక్టులకు కోడింగ్ ముగియగానే చివరగా సోసియల్ సబ్జెక్టుకు కోడింగ్ జరుగుతోంది.

సిబ్బందికి వసతుల ఏర్పాటు...

మూల్యాంకనం చేసేందుకు జిల్లావ్యాప్తంగా 1337 మంది సిబ్బందిని విధులకు ఏర్పాటు చేశారు. ఇందులో చీఫ్ ఎగ్జామినర్లు 121 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 732 మందిని, స్పెషల్ అసిసెంట్లుగా 484 మందిని ఇలా మొత్తంగా 1337 మందిని నియమించారు. విధులకు హాజరయ్యే సిబ్బందికి అన్ని రకాల మౌలిక వసతులను ప్రభుత్వ పరీక్షల విభాగం ఏర్పాటు చేసింది.

పక్కాగా నిబంధనలు అమలు: మూల్యాంకనంలో పాల్గొనే సిబ్బందికి గుర్తింపు కార్డులు జారీ చేశారు. ఈ కార్డు ఉన్న వారినే ఆ ప్రాంతంలోకి అనుమతించనున్నారు. మూల్యాంకనం జరుగుతున్న అన్ని రోజులు అటువైపు ఇతరులు రాకుండా ఆంక్షలు విధిస్తున్నారు.

విడతల వారిగా..

ఈ ఏడాది వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1,72,172 జవాబు పత్రాలను ఇక్కడ మూల్యాంకనం చేయనున్నారు. ఇందుకోసం 1,337 మంది సబ్జెక్టు టీచర్లను విద్యాశాఖ నియమించింది. ఈ మూల్యాంకన కేంద్రంలో జిల్లా విద్యా శాఖ అధికారి క్యాంపు ఆఫీసర్‌గా, డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్‌లు డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లుగా, మరో ఏడు మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లుగా వ్యవహరిస్తారు. వీటితోపాటు ప్రతి గ్రూపునకు ఒక చీఫ్ ఎగ్జామినర్ (సీఈఓలు), ఆరుగురు సహాయ ఎగ్జామినర్లు (ఏఈలు), ఇద్దరు స్పెషల్ అసిసెంట్లు (ఎస్పీఏ) పాల్గొంటారు. ప్రతి సహాయక ఎగ్జామినర్ రోజుకు 40 పేపర్లను మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకం

- వక్ఫ్ ఆస్తులు ముస్లింల పూర్వీకులు ఇచ్చినవి
- ఆధార పత్రాలు చూపాలంటే ఎలా సాధ్యం
- వక్ఫ్ చేయడానికి డిక్లరేషన్ కోరడం అసంబద్ధం
- ట్రిబ్యునల్, సర్వే కమిషన్ అధికారాల తొలగింపు తగదు
- బిల్లుకు మద్దతు ఇచ్చిన చంద్రబాబు మైనార్టీ ద్రోహి
- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష



మాట్లాడుతున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప సెవెన్‌రోడ్స్: కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగ వ్యతిరేకమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 25, 26 స్ఫూర్తికి వక్ఫ్ సవరణ బిల్లు తూట్లు పొడుస్తోందన్నారు. ప్రజాస్వామ్య, సెక్యులర్ దేశంలో ముస్లింలను ద్వితీయ శ్రేణి పౌరుల స్థాయికి దిగజార్చేందుకు ఎన్డీఏ ప్రయత్నిస్తోందన్నారు. 1954 నుంచి అమలులోకి వచ్చిన వక్ఫ్ చట్టానికి గతంలో జరిగిన సవరణలకు, నేటి సవరణలకు చాలా వ్యత్యాసముందన్నారు. గత ప్రభుత్వాలు ముస్లిం మత పెద్దలతో చర్చించాకే సవరణలు చేసిన సంగతి ఆయన గుర్తు చేశారు. మసీదులు, దర్గాలు, అషుర్‌ఖానాలు, స్మశానాల నిర్వహణ కోసం తమ పూర్వీకులు భూములను దానంగా ఇచ్చారని తెలిపారు. అవి అల్లాహ్‌కు సంబంధించిన ఆస్తులుగా తాము భావిస్తామన్నారు. కానీ నేటి ఎన్డీయే ప్రభుత్వం దాని అర్థాన్నే మార్చేస్తోందన్నారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన ఆధార పత్రాలు చూపమంటే ఎవరు చూపగలరని ప్రశ్నించారు. ఎవరు వక్ఫ్ చేయాలన్నా వారు ఐదేళ్లు ముస్లింగా ప్రాక్టీస్ చేసి ఉండాలని, ఇందుకు సంబంధించిన డిక్లరేషన్‌ను కోరడం ఏమిటంటూ ఆయన మండిపడ్డారు. వక్ఫ్ ట్రిబ్యునల్, సర్వే కమిషన్‌లా అధికారాలను తొలగించి కలెక్టర్లకు కట్టబెట్టడం తగదన్నారు. ఇప్పటివరకు వక్ఫ్ ఆస్తులకు సంబంధించి టైటిల్ నిర్ధారించే హక్కు వక్ఫ్ ట్రిబ్యునల్, కమిషన్‌కు మాత్రమే ఉండేదని, దాన్ని కలెక్టర్లకు కట్టబెట్టడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఎందుకంటే కలెక్టర్లు అధికారంలో ఉన్న వారికి అనుకూలంగా ఉంటారని తెలిపారు. డిఫెన్స్, రైల్వే తర్వాత వక్ఫ్ బోర్డుకే అధికంగా ఆస్తులు ఉన్నాయంటూ కేంద్ర మంత్రి కిరణ్ రిజుజు మాట్లాడటం సహేతుకం కాదన్నారు. ప్రభుత్వం రైల్వే, డిఫెన్స్‌లకు భూములు కేటాయించింది తప్ప వక్ఫ్‌కు కేటాయించలేదన్నారు. వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్న భూములు తమ పూర్వీకులు దానం చేసినవన్న విషయాన్ని మరవరాదన్నారు. బీజేపీ తన రాజకీయ లబ్ధికోసం దేశాన్ని ముక్కలు చేసేందుకు వక్ఫ్ సవరణ బిల్లు తెలుస్తోందని ఆరోపించారు. సవరణ బిల్లు ద్వారా వక్ఫ్‌కు ఆదాయం పెంచుతామని ప్రభుత్వం మాట్లాడటం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఇప్పటివరకు వచ్చే ఆదాయంలో ముతవల్లీలు ఏడు శాతం వక్ఫ్‌కు చెల్లించేవారని, ఇప్పుడు సవరణ బిల్లులో దాన్ని ఐదు శాతానికి తగ్గించారన్నారు. ఇందువల్ల వక్ఫ్‌కు ఆదాయం తగ్గుతుందేగానీ ఎలా పెరుగుతుందో ప్రభుత్వమే చెప్పాలన్నారు. వక్ఫ్‌బోర్డులో నాన్ మైనార్టీలకు అవకాశం కల్పిస్తూ సవరణలు చేయడం అన్యాయమన్నారు. తిరుమల–తిరుపతి దేవస్థానం తదితర పాలక మండళ్లలో మైనార్టీలకు అవకాశం కల్పించనప్పుడు వక్ఫ్‌బోర్డులో ఇతరులకు ఎలా అవకాశం కల్పిస్తారని ప్రశ్నించారు. ఇటీవల జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లింలకు రక్షణగా ఉంటానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు బిల్లుకు మద్దతు ఇవ్వడం ద్వారా ముస్లిం ద్రోహిగా చరిత్రలో మిగిలిపోతారన్నారు. టీడీపీలోని మైనార్టీలు పునరాలోచించుకోవాలని, లేదంటే వారిని ముస్లింలు వెలివేస్తారని హెచ్చరించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లింల కోసం రిజర్వేషన్లను తీసుకొచ్చారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మైనార్టీలకు పెద్దపీట వేశారని కొనియాడారు. మైనార్టీల సంక్షేమానికి రూ. 26 వేల కోట్లు ఖర్చు చేసిన ఘనత ఆయనదేనన్నారు. హజ్ యాత్రికుల కోసం ఎంబార్కేషన్ పాయింట్‌ను తీసుకొచ్చారన్నారు. జాయింట్ పార్లమెంటరీ కమిటీలో వక్ఫ్ సవరణ బిల్లును తమ పార్టీ వ్యతిరేకించిందన్నారు. ఈ సమావేశంలో హజ్ కమిటీ మాజీ చైర్మన్ గౌసులాజం, కార్పొరేటర్లు షఫీ, అక్బర్ అలీ, మైనార్టీ నాయకుడు బీహెచ్ ఇలియాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బద్వేలు అర్బన్ : బద్వేలు – మైదుకూరు రహదారిలోని తొట్టిగారిపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని కొత్త చెరువు గ్రామానికి చెందిన చరణ్, చిన్న, రాజేశ్వర్‌రావులు హైవే రోడ్డు పనులకు కూలీలుగా వెళుతుండేవారు. రోజూ మాదిరే పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళుతున్న సమయంలో వేగంగా వచ్చి ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టి వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ముగ్గురూ కిందపడి గాయాలు కావడంతో స్థానికులు 108కు సమాచారమిచ్చారు. అక్కడి నుంచి క్షతగాత్రులను ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

పలుచోట్ల దొంగతనాలు



చోరీ జరిగింది ఈ అంగన్‌వాడీ కేంద్రంలోనే

వేంపల్లె : వేంపల్లెలో గుర్తు తెలియని వ్యక్తులు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. మంగళవారం రాత్రి వేంపల్లెలోని మెయిన్ బజార్‌లో ఉన్న అమ్మవారిశాల అంగన్వాడీ కేంద్రానికి ఉన్న తాళాలు తీసి అంగన్వాడీ కేంద్రంలో ఉన్న 35 ప్యాకెట్ల కంది పప్పు, నాలుగు బాక్సులు (40 లీటర్ల) పాల ప్యాకెట్లను దొంగిలించినట్లు అంగన్వాడీ కార్యకర్త తెలిపారు. అలాగే జిల్లా పరిషత్ బాలుర పాఠశాల సమీపంలో ఉన్న ఇందు ట్రావెల్స్ కార్యాలయానికి ఉన్న బీగాలు పగులగొట్టి రూ.45వేల నగదు తోపాటు మూడు పాత సెల్ ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితుడు సురేష్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రం ఉన్న ప్రాంతంలో సాయంత్రం పూట ఎక్కువ మంది ఆకతాయిలు ఉంటారని, వారి పనై ఉంటుందని అంగన్వాడీ కార్యకర్త అనుమానం వ్యక్తం చేశారు. గత రెండు రోజుల క్రితం పులివెందుల బైపాస్ రోడ్డులో కూడా చిన్న, చిన్న దుకాణాల్లో చోరీలు జరిగినట్లు సమాచారం. అలాగే బృందావన కాలనీలో 10 బైకులలో ఉన్న పెట్రోలును దుండగులు దొంగిలించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా



టైరు పగలడంతో ప్రమాదానికి గురైన ఆటో

కొండాపురం : మండల పరిధిలోని కె.సుగుమంచిపల్లె గ్రామ సమీపంలోని నాలుగు వరుసల జాతీయ రహదారిపై ఆటో టైరు పగలడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వివరాలిలా.. మండలంలోని తిమ్మాపురం నుంచి తాడిపత్రి వైపు ప్రయాణిస్తున్న ఆటో దారి మధ్యలో కె.సుగుమంచిపల్లె గ్రామ సమీపం వద్ద జాతీయ రహదారిపై టైర్ పగలడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ముగ్గురు గాయపడటంతో 108 వాహనంలో తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో ధర్మవరానికి చెందిన పుల్లయ్యకు తలకు తీవ్ర గాయంతో పాటు కాలు విరిగినట్లు స్థానికులు తెలిపారు. మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

సీపీఎం నేతల చుట్టూ స్థల వివాదం

- ప్రభుత్వ స్థలం లైబ్రరీకి కేటాయింపు
- కార్పొరేషన్‌లో తీర్మానం చేయించిన సీపీఎం నాయకులు
- నేడు తన పట్టా అంటున్న ఆ పార్టీ జిల్లా మాజీ కార్యదర్శి
- భగత్‌సింగ్ నగర్‌లో స్థానికులు, సీపీఎం నేతల మధ్య ముదిరిన వివాదం



భగత్‌సింగ్ నగర్‌లో వివాదంలో ఉన్న ప్రభుత్వ స్థలం



స్థలం వద్ద సీపీఎం నాయకులు (ఫైల్)

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కడప భగత్‌సింగ్ నగర్‌లోని విలువైన ఓ ప్రభుత్వ స్థలం విషయంలో స్థానిక ప్రజలు, సీపీఎం నాయకుల మధ్య వివాదం మళ్లీ రాజుకుంది. ఆ స్థలం తమ పట్టా అంటూ సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి నారాయణరెడ్డి ఇటీవల చదును చేయడంతో, అది గుడి స్థలమంటూ స్థానికులు అడ్డుచెప్పడంతో పోలీసులు ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపారు. గతంలో ఇదే స్థలాన్ని లైబ్రరీ నిర్మాణం కోసం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీ సమావేశంలో తీర్మానం చేయించిన సీపీఎం, నేడు ఆ పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి ఆ స్థలం తమదేనంటుంటే మౌనముద్ర దాల్చడం చర్చనీయాంశంగా మారింది. చిలికి చిలికి ఈ అంశం ఆ పార్టీ రాష్ట్ర కమిటీ దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నేత ప్రభాకర్‌రెడ్డి ఇటీవల కడపలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఈ అంశాన్ని ప్రస్తావించినట్లు సమాచారం. స్థల వివాదానికి సంబంధించిన వివరాల్లోకి వెళితే....

చెమ్ముమియాపేట గ్రామ సర్వే నెంబరు 344లో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల దక్షిణం వైపు మూడు సెంట్ల ప్రభుత్వ స్థలం ఖాళీగా ఉంది. సెంటు రూ. 20 లక్షలకు పైగా పలుకుతోంది. ఆ స్థలం విషయంలో చంద్రగిరి నారాయణ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు ఏర్పాటు చేసుకున్న గణేష్ ఉత్సవ కమిటీ, సీపీఎం నాయకుల మధ్య సుమారు పదేళ్లుగా వివాదం ఉంది. 1998 నుంచి ఆ స్థలంలో వినాయక చవితి సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించేవారమని, అక్కడ సీతారామాంజనేయ ఆలయం నిర్మాణాన్ని చేపట్టేందుకు చందాలు పోగు చేసుకుని ఐరన్ పిల్లర్లు కూడా ఏర్పాటు చేసుకున్నారని స్థానికుల కథనం. అయితే సీపీఎం నాయకులు కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టేందుకు దౌర్జన్యానికి దిగుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ 2016 డిసెంబరు 20న కడప తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉంటే 2001–02లో అప్పటి తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి తమ పార్టీ నాయకుడు బి.నారాయణరెడ్డి సతీమణి పి.పద్మమ్మకు ఆ స్థలాన్ని డీకేటీ పట్టాగా ఇచ్చారని సీపీఎం నాయకుల వాదన. లైబ్రరీ ఏర్పాటు చేసేందుకు ఆమె తన స్థలాన్ని బహుమానంగా ఇచ్చారని వారు చెబుతూ దాన్ని ఆక్రమించేందుకు రాయలసీమ కమ్యూనిస్టు పార్టీకి చెందిన కొంతమంది అక్కడ సీతారాముల విగ్రహాలు ఏర్పాటు చేసి మతపరమైన హింసను ప్రేరేపించడం ద్వారా శాంతికి విఘాతం కల్పిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీపీఎం నాయకుడు 2016 డిసెంబరు 31న కడప తాలుకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసుల నివేదిక ఆధారంగా అప్పటి కడప తహసీల్దార్ ప్రేమంత్ కుమార్ ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించరాదంటూ సెక్షన్ 145 సీఆర్‌పీసీ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆ స్థలం తమ పార్టీ నేత నారాయణరెడ్డి సతీమణిదంటూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపిన సీపీఎం నాయకులు, చెమ్ముమియాపేట వీఆర్వోకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఆ స్థలం బి.సరస్వతమ్మకు ప్రభుత్వం కేటాయించగా, ఆమె అనుమతితో తాము నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నించామని పరస్పర విరుద్ధంగా చెప్పడం గమనార్హం. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు చూపాలని వీఆర్వో కోరగా, కనిపించడం లేదని చెప్పారు. తహసీల్దార్ కార్యాలయంలో కూడా అందుకు సంబంధించిన రికార్డులు లేవని స్పష్టం చేస్తూ చెమ్ముమియాపేట వీఆర్వో నివేదిక ఇచ్చారు. దాన్ని అప్పటి తహసీల్దార్ 2017 మే 15వ తేదీ ఆర్డీఓకు పంపారు. ఆ స్థలంలో స్థానికుల కోరిక మేరకు గుడి నిర్మాణానికి అనుమతి ఇవ్వాలనే అర్థం స్ఫురించే విధంగా తహసీల్దార్ తన నివేదికలో రాశారు. ఈ క్రమంలో సీపీఎం జిల్లా నాయకత్వం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ బాడీలో తీర్మానం చేయించేందుకు ప్రయత్నించింది. లైబ్రరీ కమిటీ (సుందరయ్య స్మారక కేంద్రం ట్రస్టు)కి అనుమతి ఇస్తూ జనరల్ బాడీ సమావేశం 2017 ఏప్రిల్ 19వ తేది తీర్మానం నెంబరు 155 ఆమోదించింది.

అయితే గతనెల 24వ తేది సీపీఎం నాయకుడు నారాయణరెడ్డి ఆ స్థలం తనదేనంటూ జేసీబీతో చదును చేయించగా, శ్రీ సీతారామాలయ కమిటీ చైర్మన్ సి.నారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ స్థలంపై నకిలీ పట్టా సృష్టించి హార్డ్‌వేర్ షాపు యజమాని సురేంద్రారెడ్డి అనే వ్యక్తికి సీపీఎం మాజీ జిల్లా కార్యదర్శి విక్రయించారని సి.నారాయణ అనే స్థానికుడి అభియోగం. ఈ వ్యవహారంపై విచారణ జరిపి ఆ స్థలాన్ని గుడి నిర్మాణానికి కేటాయించాలని ఆయన అధికారులను కోరారు.

సీపీఎం నేతల మౌన ముద్ర

భగత్‌సింగ్ నగర్‌లోని ప్రభుత్వ ఖాళీ స్థలం విషయంలో ఇంత జరుగుతున్నా సీపీఎం జిల్లా నాయకులు మౌనముద్ర వహించడం విమర్శలకు తావిస్తోంది. ఒకప్పుడు అదే స్థలాన్ని లైబ్రరీ కమిటీకి కేటాయించాలని మున్సిపల్ జనరల్ బాడీలో తీర్మానం చేయించిన ఆ పార్టీ నాయకులు, నేడు అదే పార్టీకి చెందిన మాజీ జిల్లా కార్యదర్శి నారాయణరెడ్డి ఆ స్థలం తన పట్టా అని మాట్లాడుతున్నా మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

మహిళ మెడలో గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మేకలబాలాయపల్లిలో గ్రామంలో వల్లెపు ఆశ అనే మహిళ మెడలో ఉన్న బంగారు గొలుసు లాక్కొని ఓ దుండగుడు పరారైన సంఘటన బుధవారం జరిగింది. స్థానికులు, కలమల్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఉగాది పండుగ సందర్భంగా మేకలబాలాయపల్లె గ్రామంలోని బంధువుల ఇంటికి సింహాద్రిపురం మండల పరిధిలోని గురిజాల గ్రామానికి చెందిన వల్లెపు ఆశ అనే మహిళ వచ్చింది. ఈ గ్రామంలో ఉగాది పండుగ సందర్భంగా పెద్దమ్మతల్లి, దుర్గమ్మతల్లికి గ్రామ ప్రజలు బోనాలు మూడు రోజులు పాటు నిర్వహిస్తారు. బుధవారం వల్లెపు ఆశ పిల్లలకు ఐస్ కొనుక్కునేందుకు ఇంటి నుంచి బయటకు రోడ్డుపైకి వచ్చింది. ఈ సమయంలోనే ఓ గుర్తు తెలియని వ్యక్తి బైక్‌లో వచ్చి వల్లెపు ఆశ మెడలో ఉన్న సుమారు రెండు తులాల బంగారు గొలుసును లాక్కొని ప్రొద్దుటూరు వైపు పరారయ్యాడు. వెంటనే బాధితురాలు కలమల్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వెంటనే పోలీసులు సమీపంలోని సీసీ పుటేజీలు పరిశీలించారు. కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నామన్నారు.

విద్యార్థిని అదృశ్యం



యశోద(ఫైల్)

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని సాంఘిక సంక్షేమ గిరిజన స్కూల్‌లో విద్యార్థిని అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న యశోద ఉదయం 7 గంటలకు హాస్టల్ నుంచి బయటకు వచ్చి అదృశ్యమైందన్నారు. విద్యార్థినికి మతిస్థిమితం సరిగా లేదని స్కూల్ ప్రిన్సిపాల్ విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట డీవైఎఫ్‌ఐ నిరసన

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని, సత్వరమే పరీక్షల తేదీ ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన చలో విజయవాడ పిలుపునిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ హెచ్చరించారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలని కోరుతూ బుధవారం కడపలోని మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో 2022లో నోటిఫికేషన్ ఇచ్చి మూడు సంవత్సరాలు అవుతున్నా ఇంతవరకు కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదన్నారు. ప్రతిపక్షంలో ఉండగా యువగళం పాదయాత్రలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ అధికారంలోకి వచ్చాక ఆరు నెలల్లో కోర్టు కేసులు క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామని చెప్పారన్నారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఇంతవరకు అతీగతీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బ నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, నగర సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు వంశీ, విద్యుత్ రామకృష్ణ, నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు.

కత్తితో దాడి చేసిన నిందితులు అరెస్టు



నిందితులతో సీఐ రోషన్, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం : కత్తితో పొడిచి ముగ్గురు యువకులను గాయపరిచిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్, ఎస్ఐ ప్రతాప్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. గతంలో ఇందిరమ్మ కాలనీకి చెందిన షేక్ సల్మాన్ అనే యువకుడు అక్కా నగర్‌కు వచ్చి వేగంగా బైక్ నడుపుతుండగా అదే కాలనీకి చెందిన సోహైల్ యాక్సిడెంట్లు జరిగే అవకాశం ఉందని మందలించాడు. దీంతో సల్మాన్ అతనిపై కక్ష పెంచుకుని తండ్రి మహబూబ్ షరీఫ్‌తో కలసి గత నెల 31వ తేదీన సోహైల్ తన ఇంటి ముందు నిలబడి ఉండగా కావాలనే బైక్ తగిలించాడు. అతడు కిందపడిన తర్వాత కత్తితో పొడిచి బలమైన రక్తగాయం చేశాడు. అదే సమయంలో అతడిని వారించడానికి వచ్చిన షాబాజ్, రియాజ్‌లను సైతం సల్మాన్ తన తండ్రి సహకారంతో పొడిచి గాయపరిచాడు. ఈ కేసులో నిందితులను బుధవారం పట్టణ పరిధిలోని కంచి వరదరాజ స్వామి ఆలయం వద్ద అరెస్టు చేసి వారి వద్ద నుంచి కత్తితో పాటు బైక్ స్వాధీనం చేసుకున్నామని వివరించారు. కాగా తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అర్ధరాత్రి వరకు పిల్లలు బయట తిరుగుతుంటే తల్లిదండ్రులు మందలించాలన్నారు. ఈ సమావేశంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగ్గురు క్రికెట్ బుకీలు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఆర్ట్స్ కాలేజీ సమీపంలో క్రికెట్ పందేలు నిర్వహిస్తున్న ముగ్గురిని వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లో బెట్టింగ్ నిర్వహించి లావాదేవీలు చూసుకుంటూ ఉండగా వన్‌టౌన్ ఎస్ఐలు సంజీవరెడ్డి, శ్రీనివాసులు బుధవారం సాయంత్రం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ప్రొద్దుటూరుకు చెందిన ఉట్ల మధుసూదన్, చాకలి పెద్ద నరసింహులు, మల్లెల నరసింహారెడ్డిలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.55వేలు నగదు, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మరి కొంత మందిని అరెస్టు చేయాల్సి ఉందని ఎస్ఐలు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేశామని వివరించారు.

నకిలీ ఫోన్‌పేతో జనరల్ స్టోర్‌లో రూ.3 లక్షల మోసం

ముగ్గురు యువకులపై కేసు నమోదు

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని నక్కలదిన్నెరోడ్డులో గల నరసింహ సరకుల అంగడిలో నకిలీ ఫోన్ పేతో మోసం చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. చాపాడుకు చెందిన శివ, లక్ష్మీపేటకు చెందిన వీరాంజనేయ రెడ్డి, సీతారామాపురానికి చెందిన సాయి అనే ముగ్గురు యువకులు గత మూడు నెలలుగా నరసింహా సరుకుల అంగడిలో నకిలీ ఫోన్‌పేతో మోసం చేస్తున్నారు. ముగ్గురు యువకులు రోజుల వ్యవధిలో తరచుగా జనరల్ స్టోర్ వద్దకు వెళ్లి రూ.2–10 వేల వరకూ సరకులను కొనుగోలు చేసి ఫోన్‌పేలో నగదు చెల్లించినట్లు నకిలీ ఫోన్‌పే చూపిస్తున్నారు. గత మూడు నెలలుగా రూ.3లక్షల వరకూ ఫోన్‌పేలో డబ్బులు వేసినట్లు నమ్మించారు. అనుమానం వచ్చిన దుకాణం నిర్వాహకుడు బుధవారం రోజూ వేసే నంబరుకు కాకుండా వేరే నంబరుకు ఫోన్‌పే నగదు పంపించాలని చెప్పడంతో మోసం బయటపడింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించగా ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కత్తి చూపి బెదిరించి.. తాళిబొట్టు సరుడు చోరీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని అమ్మవారిపల్లి గ్రామ శివారులో పాలమ్మ (50) అనే మహిళ మెడలోని బంగారు తాళిబొట్టు సరుడును దుండగుడు లాక్కెళ్లాడు. పోలీసుల వివరాల మేరకు అమ్మవారిపల్లి గ్రామానికి చెందిన పాలమ్మ గేదెలను తోలుకొని గ్రామ శివారులోని అడవుల్లోకి వెళ్లింది. తిరిగి వస్తుండగా గ్రామ శివారులోని డంపింగ్ యార్డు వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తి స్కూటీలో వచ్చి ఆమె మెడలోని బంగారు తాళిబొట్టు సరుడును లాగే ప్రయత్నం చేశాడు. ఆమె అడ్డుకోగా దుండగుడు ఆమెను చేతులతో కొట్టి, కత్తి చూపించి భయపెట్టి తాళిబొట్టు సరుడును లాక్కొని పరారయ్యాడు. తాళిబొట్టు సరుడు మూడు తులాలు ఉండగా దాని విలువ సుమారు రూ.1,80,000లు ఉంటుందని బాధితురాలు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

యూ ట్యూబర్లపై కేసు నమోదు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలానికి చెందిన యూ ట్యూబర్లు సత్యారెడ్డి, గూడూరు సుబ్రమణ్యం రాజు, శంకర్ రాజులపై బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. రైల్వేకోడూరు ఫారెస్టు రేంజర్ శ్యామ్ సుందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వేకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతినిత్యం విధులకు ఆటంకం కలిగిస్తూ, బ్లాక్ మెయిల్ చేయడం వంటి వ్యవహారాలు భరించలేక పోలీసులకు ఫిర్యాదు ఇచ్చినట్లు వారు తెలిపారు.

సమస్యల సాధనకు ఉద్యమిస్తాం

కలెక్టరేట్ ఎదుట కదం తొక్కిన ఫ్యాప్టో నాయకులు



కలెక్టరేట్ వద్ద ర్యాలీగా వస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానం, పీఆర్సీ, ఐఆర్‌లపై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలని ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల సాధన కోసం బుధవారం రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు కడప కలెక్టరేట్ ఎదుట జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండీ ఇలియాస్ బాషా అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని ర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ సీపీఎస్, జీపీఎస్‌ల స్థానంలో ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 12వ పీఆర్సీ కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యంతర భృతి(ఐ.ఆర్) ప్రకటిస్తామన్న ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు రూ.30 వేల కోట్లు ఉండగా ఇటీవల రెండు విడతలుగా రూ.7300 కోట్లు చెల్లించారన్నారు. మిగిలిన సుమారు రూ.23 వేల కోట్ల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్సీ, ఏఐఎస్‌టీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి, పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం నిర్లిప్త ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. తెలుగు భాషా ప్రయుక్త రాష్ట్రమైన మన రాష్ట్రంలో తెలుగు మాధ్యమం కొనసాగించాలని పోరాటం చేయాల్సి రావడం శోచనీయమన్నారు. అనంతరం కలెక్టరేట్ నుంచి మహావీర్ సర్కిల్ మీదుగా మళ్లీ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ ఏవీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ జనరల్ రాళ్లపల్లె అబ్దుల్లా, కో చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, రామచంద్ర బాబు, మాదన విజయకుమార్, శ్యామలాదేవి, శ్రీనివాసులరెడ్డి, ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు లక్ష్మి రాజా, శ్యాంసుందర్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ రెడ్డి, కె.సురేష్ బాబు, కంభం బాల గంగిరెడ్డి, జిల్లా నాయకులు సంగమేశ్వర్ రెడ్డి, బి.రాజు, వీరాంజనేయరెడ్డి, ఖాదర్ బాషాతోపాటు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడి మృతి



బావిలో పడి మృతి చెందిన హృదయరాజు

బద్వేలు అర్బన్ : నీరు తాగేందుకు బావిలోకి దిగి ప్రమాదవశాత్తు బావిలో పడి యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం మండల పరిధిలోని కోనసముద్రం గ్రామంలో జరిగింది. ఇందుకు సంబంధించి వివరాల్లోకి వెళితే.. బి.మఠం మండలం టి.రామాపురం గ్రామానికి చెందిన నాగిపోగు హృదయరాజు (32) గొర్రెలు మేపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈయనకు భార్య దివ్యశ్రీతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. గొర్రెల మేత కోసం పచ్చని గ్రాసం ఉన్న గ్రామాలకు బృందాలుగా వెళుతుంటారు. ఈ క్రమంలో కోనసముద్రం సమీపంలోకి కొందరు గొర్రెల పెంపకందారులు గొర్రెలను మేత కోసం తీసుకువచ్చారు. మధ్యాహ్నం సమయంలో దాహం వేస్తుండటంతో నీరు తాగి వస్తానని చెప్పి బావి వద్దకు వెళ్లాడు. అయితే ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో తోటి కాపరులు బావిలోకి వెళ్లి చూడగా బావిలో నీటిపై తేలియాడుతూ కనిపించాడు. వెంటనే వారు బావిలోకి దిగి హృదయరాజును బయటికి తీసుకురాగా అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అయితే హృదయరాజుకు ఈత రాదని తెలిసింది. నీరు తాగే సమయంలో ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెంది ఉండవచ్చని కుటుంబ సభ్యులు, పోలీసులు భావిస్తున్నారు. మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఏఎస్ఐ చంద్రమౌళి కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి



చర్మకారుల సొసైటీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న లిడ్‌క్యాప్ ఎండీ ప్రసన్న వెంకటేష్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 1580/బిలో చర్మకారుల సొసైటీకి కేటాయించిన 3.64 ఎకరాల స్థలంలో లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రసన్న వెంకటేష్ పేర్కొన్నారు. బుధవారం బద్వేలు పర్యటనకు వచ్చిన ఆయన ఆర్డీఓ చంద్రమోహన్, తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజుతో కలిసి సొసైటీకి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి సొసైటీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత కోసం లెదర్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేసి చర్మకారులకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ రాజశేఖర్, చర్మకారుల సొసైటీ సభ్యులు, దళిత ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎవరిదీ ‘చెత్త’పని?



రాజీవ్‌పార్కు ఎదుట ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట వేసిన చెత్తాచెదారం

కడప కార్పొరేషన్ : కడపలో మాజీ ప్రధాన మంత్రి రాజీవ్‌గాంధీకి అవమానం జరిగింది. నగరంలోని రాజీవ్ పార్కు ఎదురుగా ఉన్న ఆయన విగ్రహం వద్ద స్థానిక వ్యాపారులు చెత్త వేస్తున్నారు. ఎవరి వద్ద ఏర్పడిన చెత్తను వారే ఎత్తాలని నిబంధన ఉన్నా ఎవరికి వారు చెత్త ఎత్తకుండా ఇదిగో ఇక్కడ రాజీవ్ గాంధీ విగ్రహం ఎదుట వేస్తున్నారు. దీన్ని నగరపాలక సిబ్బంది కొన్ని సార్లు ఎత్తేస్తున్నా వ్యాపారుల్లో మాత్రం మార్పు రావడం లేదు. పదే పదే వారు ఇలాగే వేయడం వల్ల నగరపాలక సిబ్బంది ఎత్తడం మానేసినట్లు తెలుస్తోంది. దీంతో ఇలా విగ్రహం ముందు భాగమంతా చెత్తమయంగా మారింది.

ఆలయంలో చోరీకి యత్నం.. పట్టుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు స్వాధీనం చేసుకున్న మూట కట్టిన నగదు సొమ్ము

ముద్దనూరు : మండలంలోని కొర్రపాడు గ్రామంలోని ప్రముఖ శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయ సముదాయంలో బుధవారం పట్టపగలే చోరీకి పాల్పడ్డారు. అయితే గ్రామస్తులు అప్రమత్తంగా ఉండడంతో నిందితుల్లో ఒకరని పట్టుకుని బంధించారు. మరొకరు పారిపోయినట్లు సమాచారం. గ్రామస్తుల కథనం మేరకు గ్రామంలో చెన్నకేశవ ఆలయంతో పాటు శివాలయం, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాలు ఒకే ప్రాంగణంలో ఉన్నాయి. ఉగాది పర్వదినం సందర్భంగా చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారి కల్యాణం చదివింపులు, ఇతర ముడుపులు, కానుకలు రూపంలో భారీగా సొమ్ము హుండీలో చేరింది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఇరువురు యువకులు మూడు ఆలయాల్లోకి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. చెన్నకేశవస్వామి ఆలయంలో నగదు, ఇతర ఆభరణాలను దొంగిలించే యత్నం చేశారు. ఆలయంలోని సుమారు రూ. 50 వేల నగదును ఒక వస్త్రంలో వేసి మూట కట్టారు. ఇంతలోనే గ్రామస్తులు గుర్తించి దొంగలలో ఒకరిని పట్టుకున్నారు. మరొకరు అప్పటికే పారిపోయాడు. పట్టుబడిన నిందితుడు మైనర్‌గా గుర్తించి బంధించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టుబడిన నిందితునిది ప్రొద్దుటూరుగా గుర్తించారు. పోలీసు అధికారులు, ఆలయ ఈఓ దేవాలయాన్ని సందర్శించి చోరీ వివరాలను సేకరించారు. ఆలయంలో జరిగిన ఉత్సవాల సందర్భంగా భారీ సొమ్ము ఉంటుందనే నిందితులు ఈ చోరీకి పాల్పడి ఉంటారని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.